# దయ్యాలు చెప్పిన కథలు

'కావ్యశ్రీ'

**మరునాటి** అర్ధరాత్రి యధాప్రకారంగా దయ్యాలన్నీ కలిసి పంక్తి భోజనాలు చేశాయి. మర్రిచెట్టు కింద మంటవేసుకుని చలికాగుతున్నాయి. కథా శ్రవణ కుతూహలశీలియైన అంజనేయులు కోరగానే గుమాస్తా గురునాథం కథ ప్రారంభించింది—ఇరిగేషన్ డిపార్టుమెంటు దయ్యం.

## గుమాస్తా గురునాథం కథ

ఒకానొకచోట ఒక గుమస్తా ఉన్నాడు. అతని పేరు గురునాధం. పే అండ్ అకౌంట్స్ ఆఫీసులో పని చేస్తున్నాడు. సూపర్‌వైజర్లు తయారు చేసి పంపిన బిల్లులు సరిచూసి కంట్రాక్టర్లకు చెల్లింపవలసిన సొమ్మును లెక్క కట్టటమే అతని పని. తమ బిల్లులు సకాలంలో చెక్ చేసినందుకు తృణమో ఫణమో ముట్టజెపుతుంటారు కంట్రాక్టర్లు. గురునాధం అల్పసంతోషి. ఫలం పుష్పం తోయం- ఏమిచ్చినా సంతోషిస్తాడు తప్ప, బ్లాక్‌నైట్, డంకా ముర్గీ, తెనాలి బ్యూటీ-అంటూ ఎవరినీ ఇబ్బంది పెట్టడు.

ఫామిలీ ప్లానింగు ఆఫీసరుగా పనిచేసి రిటైరైన అతని తండ్రి ఎంత చెబుతున్నా వినకుండా మహమ్మదు గోరీ దండయాత్రలు లాగ కొడుకు కోసం పట్టువిడువకుండా ప్రయత్నాలుచేసి పదముగ్గురు ఆడపిల్లలకు తండ్రి అయ్యాడు గురునాథం. అంతటితో అతని భార్య సంతానలక్ష్మి పిల్లల్ని కనే శక్తిని కోల్పోయింది కానీ, లేకపోతే కొడుకు కోసం ఇంకా ప్రయత్నించేవాడే.

అంత పెద్దకుటుంబాన్ని తన చిన్న, జీతంతో పోషించలేక కంట్రాక్టర్ల దగ్గర చేయి చాపటం నేర్చుకున్నాడు గురునాథం. సుబ్బయ్య కొత్తగా వచ్చిన కంట్రాక్టరు. డొక్క చింపినా అక్షరం ముక్కలేదు. అయినా సర్వం తనకే తెలుసునన్నట్టు, తన తెలివి తేటలకు ఎదుటివాళ్ళు మూర్ఛపోవాలన్నట్టు మట్లాడతాడు. సారా పాటల్లో బాగా సంపాదించి, ఇక కల్తీ వ్యాపారం సాగదని గ్రహించి కంట్రాక్టరుగా అవతారం మర్చాడు సుబ్బయ్య. పంచెకట్టి, కోటుతొడిగి, మెడచుట్టూ కండువా వేస్తాడు. తన లాభంకోసం ఎటువంటి అబద్ధాలనైనా అతికేటట్టు చెప్పగలడు.

సుబ్బయ్య చేస్తున్న పనికి మొదటి బిల్లు వచ్చింది. రాత్రంతా కంటి మీద రెప్పవేయకుండా బిల్లు చెక్ చేశాడు గురునాథం. మరునాడు లక్ష రూపాయల చెక్ పట్టుకుపోతున్న సుబ్బయ్య దగ్గర చేయిచాపాడు.

"ఏమిటి?"

"మామూలు!"

"దేనికి?"

"మీ బిల్లు చెక్ చేసినందుకు!"

"అందరు కంట్రాక్టర్లు ఇస్తున్నారా?"

"ఇస్తున్నారు. కావాలంటే కనుక్కోండి."

"ఇకనేం? నేనొక్కడినీ ఇవ్వకపోయినా ఫరవాలేదు" అంటూ చేయి విదల్చకుండానే వెళ్ళిపోయాడు సుబ్బయ్య.

కళ్ళు తేలవేసి నోటమాటరాక కొయ్యబారిపోయాడు గుమస్తా గురునాథం. రాత్రంతా కష్టపడి లక్ష రూపాయల బిల్లు చెక్ చేశాడు. నాలుగో అమ్మాయి పురిటికి వచ్చింది. ఆరో అమ్మాయి పెద్దమనిషై కూర్చుంది. ఆ ఖర్చులకైనా కలిసి వస్తుందని ఆశ పడితే మొండి చేయి చూపించాడు సుబ్బయ్య. ఇతరులకు చెప్పుకునే విషయంకాధు కాబట్టి దొంగను తేలు కుట్టినట్టుగా వచ్చే దుఃఖాన్ని దిగమింగాడు గురునాథం.

పది రోజులు గడిచాయి. మరో లక్ష రూపాయల బిల్లు తెచ్చాడు సుబ్బయ్య. మామూలు ఇచ్చినా, ఇవ్వకపోయినా చెక్ చేయవలసిన బాధ్యత తనది కాబట్టి చెకింగ్ పూర్తి చేసి, చెక్కు పట్టుకుని వెళ్లిపోతున్న సుబ్బయ్య దగ్గర మరలా చేయిచాపాడు గురునాథం అలవాటు ప్రకారం.

" ఏమిటి?"

" మామూలు! "

"దేనికి?"

మీ బిల్లు చెక్ చేసినందుకు."

"అందరూ ఇస్తున్నారా?"

"ఎవ్వరూ ఇవ్వటంలేదు. మీరైనా!"

"నేను ఒక్కడిని ఇస్తే మాత్రం ఏంలాభం?" అంటూ చేయి విదల్చకుండానే వెళ్ళిపోయాడు సుబ్బయ్య.

క్రిందటిసారి అందరు ఇస్తున్నారంటే ఇవ్వకుండా వెళ్ళిపోయాడని ఈసారి వ్యతిరేక సమాధానం చెప్పి సుబ్బయ్యను చిత్తు చెయాలనుకున్న గురునాథం—తానే చిత్తయిపోయి బాణం దెబ్బతిన్న పక్షిలా గిలగిల లాడిపోయాడు. ఇక సుబ్బయ్య దగ్గర మామూలు వసూలు చేయడం సాధ్యం కాదని వూరుకున్నాడు.

(ఇవి కేవలం హాస్యం కోసం కల్పించబడిన కథలు. మీ స్వరూప స్వభావాలు కానీ, పేరు, ఉద్యోగం కానీ, డిపార్టుమెంటుకానీ ఇందులో కనపడితే భుజాలు తడుముకోకండి. అవన్నీ మీ పక్కవాళ్ళవిగా భావించి చదువుకోండి. అంతే!

రచయిత.)

టన్నెల్ త్రవ్వకం పూర్తయింది. దానికి కాంక్రీటు వేయిస్తున్నాడు సుబ్బయ్య. ఆ పని మీద ఉన్న సూపర్‌వైజర్ జగన్మోహనరావు గట్టివాడు. కదలకుండ రాత్రింబవళ్ళు దగ్గరుండి సిమెంట్ లెక్క ప్రకారం కలిపిస్తున్నాడు. సిమెంట్ అమ్ముకొని సొమ్ము చేసుకుందామనుకున్న సుబ్బయ్య అంచనా తారుమారయ్యేలా ఉంది. దానికో ఉపాయం ఆలోచించాడు సుబ్బయ్య.

సూపర్‌వైజర్ జగన్మోహనరావుకు ఇటీవలే పెళ్ళయింది. పదిరోజుల క్రితమే భార్యను తెచ్చుకుని కొత్తగా కాపురం పెట్టాడు. భార్య పేరు పద్మ. ఇంట్లో మరెవ్వరూ లేరు. జగన్మోహనరావు పనిమీదకు వెళితే పద్మ ఒక్కతే ఉండాలి ఇంట్లో.


పద్మ, సుబ్బయ్య ఒక ఊరివాళ్ళే! పద్మ తండ్రి బలరామయ్య, సుబ్బయ్య స్నేహితులు. ఇద్దరివీ యెదురెదురు ఇళ్ళు. చిన్నప్పటి నుంచి తెలిసినవాడు కావటంవల్ల సుబ్బయ్యను తండ్రిలా గౌరవిస్తుంది పద్మ. ఆ చనువుతో తరచు వాళ్ళ ఇంటికి వెళ్ళి క్షేమసమాచారాలు కనుక్కుంటున్నాడు సుబ్బయ్య. స్వగ్రామం వెళ్ళివచ్చి పద్మ పుట్టింటి వార్తలు చెపుతుంటాడు.

జగన్మోహనరావు పనిమీదకు వెళ్ళగానే వాళ్ళ ఇంటికి వెళ్ళాడు సుబ్బయ్య. ఎప్పటిలాగానే ఆదరించి, గౌరవించి కాఫీ ఇచ్చింది పద్మ.

"ఈమధ్య ఇంటికి వెళ్ళారా, నాన్నగారూ?"

"వెళ్ళి ఇప్పుడే వస్తున్నా నమ్మా! అమ్మా, నాన్న, అన్న, వదిన, చెల్లాయి అందరూ బాగానే ఉన్నారు. నీగురించే మీ అమ్మా నాన్న ఆందోళన పడుతున్నారు. కొత్తకాపురం కదా! ఎలా చేసుకుంటున్నావో, మీ ఆయన యెలా చూసుకుంటున్నాడో అనే వాళ్ళ బెంగ. అల్లుడు మంచివాడు, బుద్ధిమంతుడు అని చెప్పాననుకో! అయినా, నీ మంచిచెడ్డలు కనుక్కుంటూ ఉండమన్నాడు మీ నాన్న. ఇంతకీ యెలా ఉంటున్నాడు మీ ఆయన?"

"ఆయన చాల మంచివారు, నాన్నగారూ!"



“ఏమిటి, నాన్నగారూ, ఏం విన్నారు?”

“లేబరులో ఓ వన్నెల విసనకర్ర ఉందట!”

ఆమాట వినగానే పద్మ గుండెలో రాయిపడింది. కాళ్ళు వణికాయి. కన్నులు చెమ్మగిలాయి. కంఠం మూగవోయింది. నిట్టూర్పులెక్కువయ్యాయి. మనసు గిలగిలలాడింది.

“నీతో అలా చెప్పి ఆ కుర్రదానికోసం పోతున్నా డన్నమాట. బంగారపు బొమ్మలా ఉన్నావు. నీకేం లోటని ఆ లేబరు దానివెంట పడుతున్నాడు? ఊ! ఏం చెప్పను, తల్లీ? తాను మునిగింది గంగ-తాను వలచింది రంభ అని వట్టినే అన్నారా?”

“నాన్నగారూ!”

“కంగారు పడకమ్మా! చూచాయగా విన్నానంతే! విన్నవన్నీ నిజమనుకుంటే యెలా? ఎంతమట్టుకు నిజమో, యెందుకీ మాట పుట్టిందో తెలుసుకోవాలికదా! ఇటువంటి విషయాలను రట్టు చేసుకోకూడదు. గుట్టుగా పరిష్కరించుకోవాలి.”

“పెద్దవారు మీరే మందలించాలి.”

“అబ్బే! ఇటువంటి విషయాల్లో మగాడిని మందలించకూడదు. మనకా సంగతి తెలియనట్టే ఉండాలి. మనకు తెలిసిందని అతనికి తెలిస్తే, ఎలాగా తెలిసిందికదా అని బరితెగించిపోతాడు.”

“రోజూ రాత్రిపూట ఇంట్లోనే పడుకుంటున్నాడా?”

“ఎక్కడో కాంక్రీటు వేస్తున్నారట. ఆ కంట్రాక్టరెవరోగాని పరమలోభి, దొంగముండాకొడుకూనట. ఈయన దగ్గర లేకపోతే సిమెంటుకు బదులు ఇసుక కలిపేస్తాడట. అందుకని రెండురోజుల నుంచి రాత్రులు కూడ పని దగ్గరకు వెళుతున్నారు.”

“అయితే, నేను విన్నదే నిజమేనన్నమాట!”

"నాన్నగారిని రమ్మని టెలిగ్రాం ఇవ్వనా?"

"అటువంటి తొందరపాటు పని మాత్రం చేయకు."

"మరి నన్నేం చేయమంటారు? భయంగా ఉంది."

"నువ్వేమీ భయపడకు. నేను చూస్తాగా!"

"ఏం చేస్తారు?"

"ముందా కుర్రదాన్ని పంపించేయాలి."

"అదేదో మీరే చేయాలి, నాన్నగారూ!"

"మనసు పాడుచేసుకుని బెంగపెట్టుకోకు. అసలీ వార్త ఎంతమట్టుకు నిజమో తేల్చుకోవాలికదా! పాడు ప్రపంచం. పనిలేనివాళ్ళు నీలి వార్తలు సృష్టిస్తారు. అదో ఆనందం వాళ్ళకు! అయినా, ఎందుకైనా మంచిది ఆ వన్నెల రామచిలుకను జట్టులో నుంచి విడగొట్టి వాళ్ళ ఊరు పంపించేస్తాను. ఆ సంగతి నేను చూస్తాగానీ—ఈ రాత్రి, రేపు పగలు మీ ఆయన్ని యింట్లోనుంచి కదలనీయకు. ఈలోగా దాన్ని తరిమేస్తాను."

"సరే, నాన్నగారూ, మీదే భారం."

"నీ కెందుకు, తల్లీ, నే నున్నానుగా. ఈమాట మీ ఆయన దగ్గర యెత్తకు. రహస్యం బయట పడిందని తెలిస్తే మగాడు మొండికెత్తిపోతాడు. ఏదో వంకపెట్టి ఇల్లు కదలకుండా చూడు. గడపదాటితే ఉరిపెట్టుకు చస్తానని బెదిరించు. ధైర్యంగా ఉండు. వస్తాను."

సుబ్బయ్య వెళ్ళిపోయాడు. పారిజాతాపహరణానికి ముందు సత్యభామలా జుట్టు విరబోసుకుని, కోపగృహం లేక వంటగదిలోకి వెళ్ళి అలకపాన్పుగా భావించి తుంగచాప మీద ముడిచిపెట్టుకుని పడుకుంది పద్మ.

చీకటి పడింది. జగన్మోహనరావు భోజనానికి వచ్చాడు. పద్మను చూసి విస్తుబోయాడు. ఎన్నిసార్లు అడిగినా, ఎంత బతిమాలినా కారణం చెప్పలేదు పద్మ. నుదుటిమీద చేయి వేస్తే విసిరికొట్టింది. మరోచోట ఎక్కడ చేయి వేయాలన్నా అలనాడు శ్రీకృష్ణపరమాత్మకు జరిగిన సన్మానం గుర్తుకు వచ్చి అందుకు సాహసించలేకపోయాడు.

గబగబా తానే వంట చేశాడు. ఇద్దరికీ వడ్డించాడు. మౌనంగానే నాలుగు మెతుకులు తిని, లేచి తలుపులు గడియ పెట్టింది పద్మ. పని దగ్గరకు బయలుదేరుతున్న భర్తను నిలువునా కౌగలించుకుని నిబ్బరంగా అంది—"ఎల్లుండి వరకు మీరు గడప దాటడానికి వీల్లేదు."

"నేను వెళ్ళకపోతే కొంప మునుగుతుంది."

"వెళితే, నేను ఉరిపెట్టుకుని చస్తాను." తిరుగులేనట్టుగా చెప్పింది పద్మ.

తికమకపడిపోయాడు జగన్మోహనరావు. పట్టినపట్టు విడువని పద్మ నిజంగా అంతపనీ చేస్తుందేమో! కారణమేదైనా, వరకట్నం చావే అంటారేమోని భయపడిపోయాడు. కౌగలించుకున్న పద్మను కాదనలేక ఆమెతోపాటు మంచం మీద వాలాడు.

కాంక్రీటు పని పూర్తయింది. మూడోనాడు జగన్మోహనరావు బాత్‌రూములో స్నానం చేస్తున్న సమయం చూసి మెల్లగా వచ్చాడు సుబ్బయ్య.

"అబ్బాయి వున్నాడా?"

"స్నానం చేస్తున్నారు!"

"ఆమాటగాని చెప్పావా?"

"లేదు. దాన్ని పంపించేశారా?"

"నేను విన్నది వట్టి నీలివార్త! ఏమాత్రం నిజంకాదు. అన్ని విషయాలు తెలుసుకున్నాను. మనవాడు అటువంటి మనిషి కానే కాదు. అయినా, ఎందుకైనా మంచిదని దాన్నీ, దాని మొగుణ్ణీ పంపించేశానులే! దానికి మొగుడు కూడా వున్నాడు. ఇంక భయం లేదు. నిశ్చింతగా ఉండు."

సుబ్బయ్య వెళ్ళిపోయాడు. మబ్బు విడిపోయింది. సుబ్బయ్య మాటలకు సిగ్గుతోబాటు చిగురించిన చిరునవ్వు పద్మ పెదవుల మీద ఇంకా కదను తొక్కుతూనే వుంది. గర్వం గంతులు వేస్తుంటే అనురాగం తీగలు సాగుతోంది. స్నానంచేసి వచ్చిన జగన్మోహనరావు

RADEUS/SB/5-83

దోమలా?







మీ కుటుంబం రాత్రంతా హాయిగా నిద్రపోయేందుకు
సురక్షితమైన, శక్తివంతమైన సాధనం
రూస్టర్
మస్కిటో కాయిల్ "ఫోర్టెక్స్" గలది

తయారు చేస్తున్న వారు:
సన్-అప్ బొటానిక్స్ ప్రై. లి.
788/1 జి. ఐ. డి. సి., వాపి, గుజరాత్.
డిస్ట్రిబ్యూటర్లు: రాల్లిస్ ఇండియా లిమిటెడ్

భార్య ముఖంలోని వెలుగును చూసి కారణం తెలియక అనిమిష డయ్యాడు.

"వందనాలు! వందనాలు! శ్రీవారికి!"

"ఎందు కీ కులుకులు శ్రీమతికి?"

"కోపం రాదంటే చెపుతాను."

"తాపం చల్లారింది కదా—చెప్పు!"

"నేనే జయించాను!"

"అందంగా ఓడిపోయి, మెత్తగా జయిస్తారు ఆడవాళ్ళు. అసలుసంగతి యేమిటో! పారిజాతాన్ని పెకలించి తెచ్చుకుని పెరటిదొడ్లో నాటుకున్న సత్యభామలా వున్నావు! ఏమిటి విషయం? కొంపతీసి సత్యభామలా నన్ను దానం చేయటం లేదుకదా!"

కిలకిలా నవ్వేసి జరిగినదంతా చెప్పేసింది పద్మ. మొదట అవాక్కయి మెల్లగా తేరుకున్నాడు జగన్మోహనరావు.

ఆరోజు సాయంకాలం గురునాథం, జగన్మోహనరావు కలుసుకున్నారు. మాటల సందర్భంలో సుబ్బయ్య ప్రస్తావన వచ్చింది. ఆ మరునాడు సుబ్బయ్య చేయించిన కాంక్రీటు పనికి బిల్లు పంపించాడు జగన్మోహనరావు. బిల్లువెంట వచ్చిన సుబ్బయ్య గురునాథాన్ని అడిగాడు.

"ఎంతకు వచ్చింది బిల్లు?"

"మఖూ లే! లక్షకు!"

"అమ్మో! అదేమిటి?"

"ఏమయింది!"

"ఇరవై వేలు తగ్గిపోయింది."

"ఇప్పుడేనా? ఇంతకు ముందుకూడా ఇలా తగ్గిందా?"

"ఇప్పుడేనయ్యా, బాబూ!"

"ఈ ఒక్క బిల్లుకే కదా...ఫరవాలేదు లెండి."

"ఏమో! ఇంతకు ముందుకూడా ఇలాగే తగ్గించాడేమో?"

"వాటితో బాటే ఇదీను. ఏం చేస్తాం?"

"అన్యాయం! అన్యాయం?"

వంద బస్తాల సిమెంటు పట్టుకు పోయరట!న్యాయమా?"


"ఆ సిమెంటు ఖరీదు అయిదు వేలే కదయ్యా."

"పెనాల్టీ మరో అయిదువేలు! గవర్నమెంటు ఆర్డరు."

"బుద్ధి గడ్డి తిని సిమెంటు మిగుల్చుకున్నాను. సూపరువైజరును రాకుండ చేస్తే మేస్త్రీ తగులుకున్నాడు నన్ను. వాడే చేసేడింత పని. అయిందేదో అయింది. సిమెంటుకు పదివేలు పోయినా, ఇంకో పదివేలు తక్కువయిందేం? లక్షాఇరవైవేలు వస్తుందని చెప్పింది మా అమ్మాయి లెక్క కట్టి! తక్కిన పదివేలు ఏమయినట్టు?"

"నా కేం తెలుసు? ఇదిగో బిల్లు—చూసుకోండి."

"నాకు చదువు రాదయ్యా బాబూ!"




"మీ అమ్మాయిని తీసుకు రండి చూస్తుంది."

"పొద్దుటే హైదరాబాదు వెళ్ళిపోయింది."

"అక్కడ ఉద్యోగమా?"

"లేదు. చదువుతోంది."

అంతలో అటువెళుతున్న మరో గుమస్తాను పిలిచి బిల్లు చూసి సుబ్బయ్యకు ఎంత సొమ్ము చెల్లించాలో చెప్పమన్నారు గురునాథం. బిల్లు చూసి లక్షాపదివేలలోను పదివేలు సిమెంటుకు పోతే, లక్ష రూపాయలకు చెక్కు ఇవ్వాలని చెప్పి వెళ్లిపోయాడా గుమస్తా. సుబ్బయ్య గుండె బాదుకోలేదు కానీ, కండువా విదిలించి భుజాన వేసుకున్నాడు.

"ఊ!మీకు నష్ట మెంతంటారు?"

"పదివేలు! పైసలు కాదు...రూపాయలు!"

"రూపాయలే! కలపమంటారా పదివేలు?"

"మీరు కలపగలరా?"

"నేను కాక మరెవరు కలుపుతారు?"

"సరే!కలిపేయండి! వంద రూపాయలిస్తా!"

"ఎంతాశ? పదివేలు అప్పనంగా కలిపితే, వంద రూపాయ లిస్తారా? మరొకరైతే నగం—అయిదు వేలిస్తా మంటారు. మీతో బేరం అనవసరం. వచ్చిన బిల్లును వచ్చినట్టుగానే పాస్ చేస్తాను. రేపు రండి, చెక్కు తీసుకుందురు గాని."

సుబ్బయ్య బతిమాలాడు. ప్రాధేయపడ్డాడు. చేతులు పట్టుకుని కాళ్ళు అనుకోమన్నాడు. వందనుంచి వెయ్యి రూపాయలవరకు పెంచాడు తన బేరాన్ని. ససేమిరా కుదరదన్నాడు గురునాథం. కడకు రెండువేలు వరకు వెళ్ళాడు సుబ్బయ్య.

"నన్ను ఇబ్బంది పెట్టేస్తున్నారు. సరే! ఎంత చెప్పినా వినరు కదా. మీకు నష్టం వస్తే నా కేమిటి లాభం? పదివేలు కలుపుతాను. మీరు చెప్పినట్టుగా రెండువేలు ఇవ్వండి."

"ఇస్తాను, కలపండి, బాబూ!"

"లాభం లేదు. ముందే ఇవ్వాలి."

"తరవాత నా దగ్గర పట్టుకోరు కదా!"

"ఆ భయమక్కర లేదు. నాదీ హామీ!"

"ఈ మాట మరెవరికీ తెలియకూడదు."

"ఎవరికీ చెప్పకండి. మేనేజర్‌కు తెలిస్తే వచ్చే బిల్లులో పెనాల్టీతో బాటు ఇరవై వేలు తగ్గించేస్తాడు. పి.ఎ.ఒ.కి తెలిస్తే ముప్పయివేలు తగ్గిస్తాడు. పైవాళ్ళకు తెలిస్తే తమకుకూడా కలపమంటారు. మీరంటే నాకు ప్రత్యేకాభిమానం! మహా గౌరవం! ఎందుకంటే మానాన్నలాగ ఇంచక్కా పంచె కట్టి . కోటు వేసుకుంటారు."

రెండువేలు ఇచ్చాడు సుబ్బయ్య. లక్షకు వచ్చిన బిల్లును లక్షా పదివేలకు పాస్ చేసి చెక్కు ఇప్పించాడు గురునాథం. దానితో అతని పాత బాకీ తీరిపోయింది.

కథ ముగించింది ఇరిగేషన్ దయ్యం.

ఆడిట్ దయ్యం అభ్యంతరం తెలిపింది—"గుమస్తా తన ఇష్టం వచ్చినట్టు కలపగలడా?"

"అటువంటి వాటికి అవకాశమే లేదు. గురునాథం నిజంగా కలపలేదు. సూపర్‌వైజరుచేత కావాలని కూడిక తప్పు వేయించి, దాన్ని సరిచేసి సుబ్బయ్యను కూడ సరిచేశాడు గురునాథం."

"ప్రజలను వంచించి లంచాలు తీసుకునే వాళ్ళకు మా గిరిజన రైతు నరహరి పడాల్ పేరు వింటే హడలే! ప్రజలందరు అలా తయారైతే తప్ప లంచగొండులకు బుద్ధిరాదు" అంది పంచాయతీ డిపార్టుమెంటు దయ్యం.

"ఎవరా నరహరి పడాల్? ఏమా కథ?" ఎప్పటిలా కుతూహలంగా అడిగింది ఆంజనేయులు దయ్యం.

గిరిజనరైతు నరహరి పడాల్ కథను మొదలుపెట్టింది పంచాయతీరాజ్ డిపార్టుమెంటు దయ్యం. అంతలో కోడి కూసింది. దయ్యాలన్నీ చటుక్కున మాయమైపోయాయి. చలిమంట వెలుగుతూనే ఉంది.

**(గిరిజన రైతు నరహరి పడాల్ కథ - వచ్చేవారం.)**